# అచ్చుతిప్పలు

**"అ**ంతేనంటావా?" వంటింటి గుమ్మం దగ్గర నుంచుని హుంకరించాడు మోహన్రావు.

"అవునంతే" ఖచ్చితంగా సమాధానం చెప్పింది శాంత.

"మనిషికి మరీ ఇంత మొండితనం, పట్టుదలా పనికిరాదు" అన్నాడు నిష్ఠూరంగా అదేమీ పట్టించుకోకుండా, ఘాటుగా పచ్చడి కోసం తిరగమోత వేసేసరికి అతనికి చాలా కోపం వచ్చేసింది.

"ఏమైనా అంటే ఇదుగో ఈ విధంగా తిరగమోత వేసి వెళ్లగొడుతుంది" అని విసుక్కోబోయి, చేతగాక తుమ్ముకుంటూ వచ్చి హాల్లో కూర్చున్నాడు.

ఒక్కక్షణం ఆమె మనసు మెత్తబడింది. "ఈసారికి సరే అందామా" అనుకుంది. తరువాత ఎదురయ్యే పరిణామాలు తల్చుకుని "అమ్మో వద్దు, ఆ తంటాలు పడలేను" అని మనసు కఠినం చేసుకుంది.

తుమ్ములు తగ్గాక మోహన్రావు బరువుగా నిట్టూర్చాడు. "చేతిలో కళ ఉండీ ఏం ప్రయోజనం. గుర్తింపూ, ఆదరింపూ లేక పోయాక" అనుకున్నాడు.

మాంచి హోదాగల ఉద్యోగంచేసి రిటైరయ్యాక, తనకి కాలక్షేపం కావాలనిపించింది. స్వతహాగా మంచి పాఠకుడు. సాహిత్యమంటే మక్కువ ఉన్నవాడు. కాలేజీ మేగజైన్‌లో కథలూ, కవితలూ రాశాడు.

ఇన్నాళ్ళకి మళ్ళీ ఏదైనా రాయాలనిపించింది కలంపట్టాడు. అలా ప్రారంభించిన వేళావిశేషం... బాగానే సాగింది కలం. ఏకధాటిగా ఏడెనిమిది కథలూ, అరడజను కవితలూ రాసేశాడు. అవి వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. వాటిల్లో కొన్ని పేరున్న పత్రికలు. మరికొన్ని ఎవరికీ తెలియని పత్రికలు.

ఏదిఏమైనా కథ అచ్చవడం ముఖ్యంగానీ ఆ పత్రిక గొప్పదా, కాదా? వాళ్లు పారితోషికం ఇచ్చారా, లేదా... ఇలాంటి చిన్న విషయాలు పట్టించుకోకూడదు మరి!

అతనికి మిత్రుడున్నాడు. పేరు శేఖరం. అతనూ రచయితే.

"అచ్చయిన కథలు ఇలా విడివిడిగా పడుంటే పేరు ప్రతిష్ఠా వుండదు. వీటన్నిటికంటే పుస్తకరూపంలో అచ్చేయించుకుంటే, నీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది" అన్నాడతను.

"సరే... అయితే రేపే పేరున్న పబ్లిషర్‌తో మాట్లాడతాను. వాళ్ళిచ్చే రాయల్టీ నాకు నచ్చితే వాళ్ళకే ప్రచురణ హక్కులిస్తాను" అన్నాడు మోహన్రావు హుందాగా.

పడీపడీ నవ్వాడు శేఖరం. "ఏ కాలంలో ఉన్నావు? ఈ పద్ధతికి ఏనాడో కాలంచెల్లిపోయింది. మహామహా రచయితలని తప్ప, మామూలు వాళ్ల పుస్తకాలు ఎవరూ అచ్చెయ్యరు. నీ కథలు నువ్వే అచ్చేసుకోవాలి" అన్నాడు.

"అంటే నేనే రాసుకుని నేనే అచ్చేసుకోవాలా" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్రావు.

"అంతేకాదు, నువ్వే అమ్ముకోవాలి కూడానూ" అన్నాడు శేఖరం.

ఈ పద్ధతి అంతా మాచెడ్డ అన్యాయంగా అనిపించింది మోహన్రావుకి. కానీ ఏం చేస్తాం? మన చుట్టూ జరుగుతున్న సవాలక్ష అన్యాయాల్లో ఇదొకటి?

నలుగురితో నారాయణా అని సర్దిచెప్పుకొన్నాడు. తనకు తెలిసిన పబ్లిషర్ని శేఖరమే పరిచయం చేశాడు. అతని పేరు రామారావు. ఈ రంగంలో అనుభవం ఉన్నవాడు రేటు, మొదలైన వ్యవహారాలన్నీ మాట్లాడుకున్నారు.

తీరా కథల సంఖ్య చూసి పెదవి విరిచాడు పబ్లిషరు. "పుస్తకానికి ఇవి చాలవు, మరో పది కథలైనా ఉంటేగానీ కంటికానదు" అన్నాడు.

మోహన్రావు దగ్గర మరో పది కథలున్నాయి. ఉన్నాయంటే అతని చేతుల్లో లేవు. పత్రికలవాళ్ల దగ్గరున్నాయి. "ప్రచురణకి స్వీకరించాం, వీలువెంబడి ప్రచురిస్తాం". ఆ వీలువెంబడి అనే మాటకు సరైన అర్థం లేదు. రోజులు కావచ్చు, నెలలు కావచ్చు, కొన్నిచోట్ల ఏళ్లకు ఏళ్లే పట్టచ్చు. ఫోన్ చేసి కనుక్కుంటే "చూసి చెప్తాం, మళ్లీ ఫోన్ చెయ్యండి" అంటారు. మళ్లీ ఫోన్ చేసి మన వివరాలు చెప్పుకొంటే "అవును ఉంది. వీలు వెంట ప్రచురిస్తాం" అంటారు. కాబట్టి పత్రికల దగ్గరున్న కథలని నమ్ముకుని

కూర్చునే బదులు తనవంతు ప్రయత్నంగా మరికొన్ని కథలూ రాసేశాడు. ఆముద్రితం అని అచ్చేసుకోవచ్చు అనుకున్నాడు. కవితలూ రాసేశాడు.

ఈలోగా కొన్ని కథలు పత్రికల్లో వచ్చేశాయి.

అవీ ఇవీ కలిపి చూసి తృప్తిపడి, పచ్చజెండా ఊపాడు పబ్లిషరు.

కథల సంపుటి వెయ్యి కాపీలు, కవితలు అయిదొందల కాపీలు.

కవరు పేజీ, ముందుమాట, మిత్రవాక్యం వగైరా హంగులన్నీ సిద్ధం చేసేశారు. అతను రాసిన కథల్లో "ఆకాశానికి ఆవలి అంచు' అనేది చాలా మంచి కథ. అమెరికాలో ఉన్న కొడుకుకోసం తండ్రిపడే ఆవేదన ఆ కథాంశం. కథల పుస్తకానికి ఆ పేరే పెట్టాడు.

ఇక కవితా సంపుటికి 'కలకంఠి కన్నీరు' పేరు నిర్ణయించారు. ఒక స్త్రీ పుట్టిన దగ్గర్నుండి పోయేదాకా ఎలా ఏడుస్తుందో వర్ణించే కవిత అది.

అనుకున్న దానికంటే ఆరేడువేలు అదనంగా ఖర్చయినా, పుస్తకాలు చాలా బాగా వచ్చాయి.

ఒక చిన్న హాలు అద్దెకు తీసుకుని పుస్తకావిష్కరణ సభ ఏర్పాటు చేశాడు. ఆహ్వానపత్రికలు అచ్చేయించి అందరికీ పంపించాడు. దగ్గరవాళ్ళకి ఫోన్లుచేసి చెప్పాడు. అతనికి బంధుమిత్రులు చాలామంది ఉన్నారు. అందరూ వచ్చారు. హాలు నిండింది. వచ్చిన వాళ్ళకి స్వీట్లూ, సమోసా, టీ ఇచ్చాడు.

పుస్తక పరిచయం, రచయిత గురించి నాలుగు మాటలు, స్పందన, అన్నీ యథావిధిగా జరిగిపోయాయి. వేదికమీదున్న పెద్దలకి శాలువాలు కప్పి సత్కరించాడు. సభ దిగ్విజయంగా ముగిసింది.

కాకపోతే, పుస్తకాల అమ్మకాల విషయంలో మోహన్రావుకి పాపం... నిరాశే ఎదురైంది. ముందు జాగ్రత్తగా బయట ఓ బల్లవేసి దానిమీద పుస్తకాలు పెట్టి మేనల్లుడినీ, తమ్ముడి కొడుకునీ నిలబెట్టారు. "అటు బుక్ రిలీజ్ చెయ్యగానే మీరిక్కడ అమ్మకాలు మొదలుపెట్టెయ్యండి" అని చెప్పాడు. "ఇంతమంది వచ్చారు. హీనపక్షం వంద కాపీలు ఎగిరిపోతాయి" అనుకున్నాడు. ఎగరడం మాట అటుంచి అసలు కదల్లేదు.

"పిలిచాడు కదా అని పన్లన్నీ మానుకుని డబ్బు తగలేసి మరీ ఆటోలో వచ్చాం. మాకో పుస్తకం ఊరికే ఇవ్వచ్చుకదా" అనుకున్నారు వచ్చినవాళ్లు.

"ఈ రోజుల్లో ఇంట్లోంచి బయట కాలుపెడితే వంద రూపాయలు ఖర్చయిపోతుంది. అటువంటిది ఇంత మంచి పుస్తకం వంద రూపాయలిచ్చి కొనలేరా" అనుకున్నాడు రచయిత.

ఫలితంగా... ఆపుస్తకాలన్నీ అలాగే ఇంటికి చేరాయి.

పుస్తకం అచ్చేయడానికీ, ఆవిష్కరించడానికీ చేతి చమురు బాగానే వదిలింది. ఇక రాబడికోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

పేరున్న ప్రచురణ సంస్థలకి వెళ్ళి, పుస్తకాలిచ్చి అమ్మి పెట్టమన్నాడు. ఇతను రెండేసి వందల కాపీలు ఇవ్వబోయాడు గానీ వాళ్ళు "ఇన్నేసి తీసుకోం" అని పదో పాతికో తీసుకున్నారు. "ఇవి అమ్ముడయ్యాక మళ్ళీ తీసుకుంటాం కావలిస్తే" అన్నారు. "అమ్ముడయ్యాక డబ్బిస్తాం" అన్నారు.

అన్ని పత్రికలకీ సమీక్షకోసం పంపాడు. "బానే ఉన్నాయి కానీ, రచయితకి ఇంకా బాగా చెయ్యితిరగాలి' అని రాశారు చాలా మంది. ఆర్నెల్లయినా పుస్తకాలు అలానే ఉన్నాయి, కదలిక లేకుండా.

మామూలుగా మధ్యతరగతి వాళ్ల ఇళ్ళు సామాన్లతో నిండిపోయి ఉంటాయి. సోఫాలూ, బల్లలూ కుర్చీలూ కాక ఏ కాస్త ఖాళీ ఉన్నా అలంకరణ సామగ్రి. అజాగ్రత్తగా ఉంటే కాళ్ళకేదో తగిలి కిందపడడం ఖాయం. అలమార్లూ అటకలూ ఎన్నున్నా అన్నీ నిండిపోయి ఉంటాయి.

మోహన్రావు ఇల్లూ అలాగే ఉంటుంది. ఈ పుస్తకాల పెట్టెలు కూడా తోడయ్యాయి. మొదట్లో "అమ్మో... నా భర్త రచయిత" అని మురిసిపోయినా, రాన్రానూ విసుగొచ్చింది శాంతకి. ఈ పుస్తకాల పెట్టెలొకటీ అనుకుంటూ అటూ ఇటూ జరిపి సర్దుతూ "ఉన్న చాకిరీ చాలక ఈ కంచి గరుడసేవకూడానూ" అని బాహాటంగానే విసుక్కోవటం ప్రారంభించింది.

మోహన్రావుకి కూడా కాస్త జ్ఞానోదయం అయింది. "ఇలా ఇంట్లో దాచి పెట్టుకునే బదులు ఉచితంగానే నలుగురికీ ఇస్తే వాళ్లు మరో నలుగురికి చెప్తారు. అలా పదిమందికీ తెలిసి అప్పుడు అమ్మకాలు పుంజుకుంటాయి" అనుకున్నాడు.

ఇంటికొచ్చిన వాళ్ళకి పుస్తకాలిచ్చి "చదివి మీ అభిప్రాయం చెప్పండి" అనటం, మర్నాటినుంచీ ఫోన్లుచేసి "చదివారా? ఎలా వున్నాయ్" అని అడగటం, వాళ్లేమో "పీకల్దాకా పనుల్లో మునిగిపోయివున్నాం. ఇంకా చదవలేదు చదివి చెప్తాం" అనటం.

"పోనీ అన్నీ చదవకపోయినా, పరసవేది కథ చదవండి. చిలకాగోరింకా అయినా చదవండి" అని వెంట పడడం. ఈ తతంగం కొన్నాళ్ళు గడిచింది.

తరువాత మరోమార్గం కనిపెట్టాడు. ఏడాది పొడుగునా పెళ్లిళ్లూ పేరంటాలూ జరుగుతూనే వుంటాయి. ఎవరో ఒకరు పిలుస్తూనే వుంటారు. వాళ్ళకీ ఏదో బహుమతి ఇవ్వాలి. "మళ్ళీ వేరే కొనడం ఎందుకు? ఈ రెండు పుస్తకాలూ కవర్లో పెట్టి ఇస్తే ఉభయతారకంగా ఉంటుంద'నుకున్నాడు.

అది మొదలు అందరికీ పుస్తక బహుమానమే. పుట్టినరోజైనా, షష్టిపూర్తి అయినా అదే! అనతికాలంలోనే అందరికీ అందాయి పుస్తకాలు.

శాంతకి మాత్రం ఈ పద్ధతి నచ్చలేదు. "పిడుక్కీ బిచ్చానికీ ఒకటే మంత్రం అన్నట్లు అన్నింటికీ పుస్తకాలేనా" అని దెబ్బలాడింది.

"వాళ్ళకి ఈ కళ లేదు కాబట్టి గిన్నెలూ చెంబులూ పట్టుకెళ్ళి ఇస్తారు. నాకేం ఖర్మ? నేనుమాత్రం గొప్పగా పుస్తకాలే ఇస్తాను" అన్నాడు.

"బానే ఉంది మీ గొప్ప! అందరూ ఆడిపోసుకుంటున్నారు. మొన్న విఠల్ అందరికీ శుభలేఖలు పంపి, మనకు మాత్రం శుభలేఖతోబాటు ముఖ్య గమనిక అని ఓ కాయితం ముక్క పంపాడు. "అదివరకే మాకు మీ పుస్తకాలు ఇచ్చారు. మళ్ళీ శ్రమ పడకండి, మీ ఆశీస్సులే పదివేలు" అని రాసి మరీ పంపించాడు అయినా మీకు తెలిసిరావడం లేదు అంది శాంత.

గుంభనంగా నవ్వాడు మోహన్రావు. "వెర్రిదానా! ఇంత విలువైన పుస్తకాలు ఇచ్చిన వాళ్ళకే మళ్ళీ ఇవ్వడం ఎందుకు, మరెవరికైనా ఇస్తే చదువుతారని వారి అభిప్రాయం. నువ్వనవసరంగా పెడర్థాలుతీస్తున్నావు. వాడికే మరో సెట్టు ఇస్తే ఇంకెవరికైనా ఇచ్చుకుంటాడు. డజన్లకొద్దీ వినాయకుడి బొమ్మలూ, గోడ గడియారాలూ వస్తే ఇంకెవరికైనా ఇవ్వడంలేదా... ఇదీ అంతే' అన్నాడు. తలబాదుకుంది శాంత.

ఈ విషయంలో ఒకసారి పెద్ద గొడవే అయింది. శాంతకి వదిన వరస అయిన ఒక ఇల్లాలు కైలాసగౌరి నోముచేసుకుంటూ శాంతకి ఫోన్ చేసింది. అప్పుడు శాంత ఊళ్లో లేదు. ఆ మాటే చెప్పాడు మోహన్రావు.

"వదిన లేకపోతేనేం? మీరొచ్చి ఆశీర్వదించి వెళ్ళండి అన్నయ్యగారూ! గుళ్లో పసుపు కుంకాలు పంచడం అయిపోయాక, ఇంట్లో అందరికీ భోజనాలు ఏర్పాటుచేశాం. తప్పకుండా రండి" అని చెప్పిందావిడ.

అంత ఆదరంగా పిలిచింది కదా అని బయలుదేరివెళ్ళాడు. ఎలాగూ వెళ్తున్నా కదా అని కాసిని పుస్తకాలు పట్టుకెళ్ళి, అక్కడ తెలిసిన వాళ్ళందరికీ పంచాడు.

అందరూ అపార్థంచేసుకున్నారు. ఆ వ్రతం చేసుకున్న ఇల్లాలు "ఇదంతా శాంత వదిన ఆడించిన నాటకం. ఆవిడకి నన్ను చూస్తే అసూయ" అని తూర్పారపట్టింది.

ఊర్నించి వచ్చిన శాంత విషయం తెలుసుకుని మొగుడిమీద విరుచుపడింది.

"నేనేం చేశానని ఇంత రాద్ధాంతం..." అడిగాడు మోహన్రావు.

"చాల్లే ఊరుకోండి! ఆవిడ శుభమా అని నోము చేసుకుంటూంటే మీరు తగుదునమ్మా అని 'కలకంఠి కన్నీరు' పుస్తకం పంచడం ఏమిటి? ఆ పంచేది ఏదో 'ఆకాశానికి ఆవలి అంచు' పంచకపోయారా?" అంది.

'కథల పుస్తకం ఇవ్వాళ కాకపోతే రేపైనాపోతుంది. కవితలే కదలవని రామారావు చెప్పాడు. అందుకే అవి పంచాను" అని సమర్థించుకున్నాడు.

అంతటితో ఆగక "అంటే అన్నానంటారు గానీ మా అత్తవారిపైపు వాళ్లకి బుర్రల్లో గుజ్జు శూన్యం. శీర్షిక చూసి ఆవేశపడిపోతే ఎట్లా? లోపల 'మళ్లీ వచ్చిన వసంతం, ఆనందానికి అవధుల్లేవు'... వగైరా కవితలు లేవా" అన్నాడు.

"అంతా నా ఖర్మ" అనుకుంది శాంత.

మొదట్లో తను రచయిత అయినందుకు గర్వించినా, క్రమంగా అది కాస్తా ఉక్రోషంగా మారింది మోహన్రావుకి.

అదేదో రాష్ట్రంలో రచయితలు పుస్తకం అచ్చేసుకుంటే గవర్నమెంటువారు పెద్దసంఖ్యలో పుస్తకాలు కొని ప్రోత్సహిస్తారట. మనకా అదృష్టం లేదు.

అదేదో దేశంలో కాయితం మీద కలంపెడితే చాలు, రచయితగా గుర్తించి నెత్తినపెట్టుకుంటారుట. మనకా యోగం లేదు? జబ్బులుపడిపోయేలా రాసినా ఓ పొగడ్తా వుండదూ, గుర్తింపు ఉండదు. ఎంతసేపూ "నేను ఫలానా కథ రాశాను, ఫలానా పత్రికలో వచ్చింది చదవండహో" అని రాసిన వాళ్ళు టముకువేసుకోడం తప్పించి "నీ కథ చదివాం... బావుంది" అని భుజంతట్టే నాథుడే వుండడని తల్చుకుని బాధపడడం దినచర్య అయిపోయింది.

"తనకు లేదని ఏడిస్తే ఒక కన్నుపోయిందిట, ఎదుటివాడికి వుందని ఏడిస్తే రెండు కళ్లూ పోయాయిట. ఎవరికో ఏదో వుందని ఏడిస్తే ఏం లాభం? వూరుకోండి" అని ఓదార్చింది శాంత.

ఆవిడకు భర్త వాలకం అర్థంకావడం లేదు. ఇన్నివిధాలా నెత్తి బొప్పికట్టినా, ఇంకా రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే వున్నాడు.

స్వానుభవం లేదు కాబట్టి ఆవిడకి అంతుపట్టలేదుగానీ, ఒకసారి మొదలుపెడితే ఆపటం కష్టం. మనసులో వుప్పొంగిన భావజాలాన్ని కాయితంమీద పెడితే తప్ప ఆ తపన చల్లారదు.

పోనీ కథలు రాయడం వరకూ అయితే ఆవిడకేమీ అభ్యంతరం లేదు. 'ఆకాశానికి ఆవలి అంచు' అచ్చై రెండేళ్లు తిరక్కుండానే మరో ఇరవై కథలు తయారయ్యాయి. "వాటిని అచ్చేసుకుంటాన"ంటాడు.

"బోలెడంత ఖర్చుతోగూడిన వ్యవహారం... వద్దంటుంది" శాంత. తెల్లవారి లేస్తే ఇదే గొడవ!! పోన్లే ఆయన డబ్బు, ఆయనిష్టం అని వూరుకుందామంటే... మళ్ళీ పుస్తకాలూ, పంపకాలూ, ఇవన్నీ అయ్యేసరికి మళ్ళీ కొత్త కథలు పుట్టుకొస్తాయి. ఈ వలయంనుంచి బయటపడేది ఎప్పుడు?

ఉన్న డబ్బంతాపెట్టి ఇలా అచ్చువేయించుకుంటూపోతే, పెద్ద వయసులో ఏ అనారోగ్యమో వస్తే, ఈ పుస్తకాలు చూపి 'బాబ్బాబూ' అంటే ఎవరాదుకుంటారు? ఎవరు ఉచితంగా వైద్యం చేస్తారు.

ఇవన్నీ ఆలోచించి, అంత్యనిష్ఠూరం కంటే ఆదినిష్ఠూరం మేలు అని కాస్త. కఠినంగానే వుంటోంది.

జరిగినంతకాలం జరుగుతుంది. మరీ మొండికేస్తే ఎలాగు తప్పదు.

వంట ముగించి వచ్చింది శాంత. సోఫాలో కూర్చుని వున్నాడతను. ధుమధుమలాడుతున్నాడు. అసలే బ్లడ్‌ప్రెషరున్న మనిషి. ఇలా ఆవేశపడితే ఆరోగ్యం పాడవదూ! ఇలాంటి ఆపత్సమయంలోనే ఆవిడో మంత్రం ప్రయోగిస్తుంది.

ఇంట్లో మంచాలకిందా బల్లలకిందా దాచిన అట్టపెట్టెలు తెచ్చి నట్టింట్లో పెట్టింది. అందులోంచి అచ్చేయించుకున్న పుస్తకాలు బయటికి తీసి "ఏ తీరుగ నను దయజూచెదవో" అని పాడుకుంటూ దుమ్ము దులపసాగింది.

ఆ దృశ్యం చూసి మోహన్రావు కాస్త శాంతించాడు. ఆ పుస్తకాల వంక చూసుకుని “బంగారంలాంటి పుస్తకాలు ఎందుకు అమ్ముడవడం లేదో” అనుకున్నాడు దీనంగా.

మనసులో ఓ మూలనుంచి ఆశాకిరణం తొంగిచూసింది. “ఫర్వాలేదు, మళ్ళీ మంచిరోజులొస్తున్నాయి. ఇప్పుడిప్పుడే మంచి కథలకు ఆదరణ పెరుగుతోంది. ఆదినుంచీ తెలుగు రచయితలను ఆదరిస్తున్న పాఠకులు మళ్ళీ పుస్తకాలు పట్టకపోరు!

“ఇదిలాగే కొనసాగి పూర్వవైభోగం రాకపోదు. మళ్ళీ విజయవాడలో ఒక బజారంతా పబ్లిషర్లతో వెలిగిపోయే రోజులు రాకపోవు. అప్పుడీ అచ్చేసేపని వాళ్ళకి అప్పగించి మేం హాయిగా కథలు రాసుకుంటాం. ఈ ద్విపాత్రాభినయం మానేసి రచయితలుగానే మిగిలిపోతాం. మరిన్ని మంచి కథలు రాస్తాం” అనుకున్నాడు.

ఆ భావన కలగగానే అతని మనసు తృప్తితో నిండిపోయింది. “ఉందిలే మంచి కాలం ముందు ముందునా” అని కూనిరాగం మొదలుపెట్టాడు.

శాంత “హమ్మయ్య” అని గుండెలమీద చెయ్యివేసుకుంది.

*విపుల, మే 2009*